## క్లుప్తంగా

### లక్ష్యం మేరకు మొక్కలు పెంచండి



దౌల్తాబాద్‌లో నర్సరీని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శ్రీనివాస్

దౌల్తాబాద్: గ్రామాల్లోని నర్సరీల్లో లక్ష్యం మేరకు మొక్కలు పెంచాలని ఎంపీడీఓ శ్రీనివాస్ తెలిపారు. మంగళవారం మండలంలోని దౌల్తాబాద్, గుముడాల గ్రామాల్లోని నర్సరీలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పండ్లు, పూలనిచ్చే అన్ని రకాల మొక్కలు ఉండాలన్నారు. వచ్చే వర్షాకాలం నాటికి మొక్కలు ఏపుగా పెరిగేలా చూడాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఓ అంజిలయ్య, టీఏ కృష్ణహరి తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్‌తోనే సంక్షేమం

**అంతారంలో కొత్త రేషన్‌కార్డు దారులకు బియ్యం పంపిణీ**



అంతారంలో కొత్త రేషన్‌కార్డు దారుడికి బియ్యం పంపిణీ చేస్తున్న శ్రీను తదితరులు

తాండూరు రూరల్: కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సంక్షేమం సాధ్యమని తాండూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వడ్డె శ్రీను పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని అంతారం గ్రామంలో నూతన రేషన్‌కార్డు దారులకు బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ..గతంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలోనే పేదలకు ఇళ్లు, రేషన్‌కార్డులు మంజూరయ్యాయని గుర్తు చేశారు. పదేళ్ల తర్వాత మళ్లీ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాతే అర్హులందరికీ కొత్త రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ శాంతుకుమార్ నాయకులు కరీం, పెంద్యా నర్సిములు, ప్రకాశ్, చంద్రయ్య, ఆశన్న, శ్రీనివాస్, రాజేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### నూతన వంగడాలపై దృష్టి సారించాలి

**ఉద్యాన శాఖ అధికారి అక్షిత రెడ్డి**

మర్పల్లి: నూతన వ్యవసాయ వంగడాలపై రైతులు దృష్టి సారించాలని మోమిన్‌పేట్, నవాబ్‌పేట్, మర్పల్లి క్లస్టర్ ఉద్యాన శాఖ అధికారి అక్షిత రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మండల పరిధిలోని అల్లాపూర్‌లో ఆయిల్ పామ్‌తోటల పెంపకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆయిల్ పామ్‌తోటలు పెంచితే ప్రభుత్వం నుంచి రాయితీలు పొందొచ్చన్నారు. ఎస్సీ, ఎస్టీ రైతులకు 100 శాతం సబ్సిడీపై మొక్కలు, డ్రిప్ సౌకర్యం ప్రభుత్వం కల్పిస్తుందన్నారు. ఓసీ, బీసీ, వర్గాల రైతులు ఆయిల్ పామ్ తోటలు పెంచేందుకు ముందుకు వస్తే ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ ఇస్తుందన్నారు. ఓసీ, బీసీలు ఎకరా పొలంలో ఆయిల్ పామ్ మొక్కలు 57 నాటితే రూ.1,140 చెల్లించాల్సి ఉంటుందన్నారు. 4 సంవత్సరాల వరకు అంతర్ పంటలు సాగు చేసుకునేందుకు ప్రతీ సంవత్సరం మొక్కల పెంపకానికి అయ్యే ఖర్చుల కోసం ప్రభుత్వం రూ. 4,200 ఇస్తుందన్నారు. ఎకర పొలంలో ఆయిల్ పామ్ పంట కనీసం 4 నుంచి 6 టన్నుల వరకు పంట దిగుబడి వస్తుందన్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో టన్ను ధర రూ.20వేలు ఉందన్నారు. దీంతో ఖర్చులు పోను ఎకరాకు రూ.80వేల నుంచి రూ.1,20,000 వేల వరకు ఆదాయం వస్తుందన్నారు. ఆసక్తి ఉన్న రైతులు ఆయిల్ పామ్ తోటలు సాగు చేసేందుకు ముందుకు రావాలన్నారు.

### ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత



ఆంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేకపూజలు నిర్వహిస్తున్న నేతలు

కుల్కచర్ల: ఆధ్యాత్మిక చింతనతో ప్రశాంతత చేకూరుతుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు కరణం ప్రహ్లాదరావు పేర్కొన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం సాల్వీడు గ్రామంలో ఆంజనేయస్వామి దేవాలయ వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వాహణ వల్ల గ్రామాల్లో ప్రశాంతత నెలకొంటుందన్నారు. ఈ కార్యక్రమంలో దిశ కమిటీ సభ్యుడు జానకిరాం, బీజేపీ జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల సౌమ్యారెడ్డి, మండల అధ్యక్షుడు గుడాల వెంకటయ్య, బీజేవైఎం మండల అధ్యక్షుడు గడుసు మైపాల్, మాజీ సర్పంచ్ బాలయ్య, కాటనిపల్లి అంజిలయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మల్చింగ్ పద్ధతే మేలు



ఎన్కేపల్లిలో టమాట సాగుకు వేసిన మల్చింగ్

- కూరగాయ పంటలకు అనుకూలం
- ఒక సారి నీరు పెడితే 15రోజుల వరకు అవసరం ఉండదు
- కలుపు తీతకు ఖర్చుతక్కువ
- ఆసక్తి చూపిస్తున్న రైతులు

మోమిన్‌పేట: పంటలకు తేమను నిలకడగా ఉంచేందుకు చేపట్టే ప్రక్రియను మల్చింగ్ అంటారు. వేసవిలో ఎండ తీవ్రత వల్ల ఉష్ణోగ్రతలు పెరిగి భూగర్భ జలాలు అడుగంటిపోతున్నాయి. పంటలకు సరిపడా నీరు అందక కూరగాయ పంటలు, తోటలు దెబ్బతినే ప్రమాదముంది. అలాంటప్పుడు వీటిలో తేమ నిలకడగా ఉండాలంటే మల్చింగ్ పద్ధతిని పాటిస్తే మేలని ఉద్యానశాఖ అధికారి అక్షితరెడ్డి తెలిపారు. మల్చింగ్ విధానంతో సాగు చేస్తే తప్పనిసరిగా డ్రిప్ పరికరాలు ఉండాలి. మొదటగా భూమిని గుల్లగా దున్ని బెడ్‌లను తయారు చేసుకోవాలి. అనంతరం బెడ్‌పై ప్లాస్టిక్ షీట్లను ఉంచాలి. మొక్కను నాటడం, విత్తు విత్తుకునే దగ్గర చిన్న పాటి రంధ్రం చేయాలి. మల్చింగ్ విధానంలో ఒకసారి నీరు పెడితే నేలను బట్టి వారం నుంచి 15రోజుల వరకు తడినివ్వాల్సిన అవసరముండదు. ఎరువులు నేరుగా మొక్కకే అందుతాయి. కలుపు తీతకు పెట్టే పెట్టుబడి తగ్గుతుంది. మొక్క సాధారణ ఎదుగుదల కంటే 50శాతం రెట్టింపు పెరిగి దిగుబడులు అధికంగా వస్తాయి. బాహ్యావాతావరణం వల్ల వచ్చే తెగుళ్లు నివారించే అవకాశం ఉంటుంది.

**విత్తే ముందు...**

మొక్కల మధ్య, వరుసల మధ్య గల దూరాన్ని బట్టి నాగలి సాలు మీద చేసుకున్న బెడ్‌పై షీట్‌ను పరవాలి. రెండు వైపులా కొనళ్లపై మట్టిని ఎగదోస్తే షీట్ గాలికి కొట్టుకొని పోకుండా ఉంటుంది. డ్రిప్ ద్వారా నీరు పడుతున్నా దగ్గర చిన్న రంధ్రం చేసుకోవాలి. అక్కడే నారు వేయడం, విత్తుకోవడం చేయాలి.

**కూరగాయ పంటల్లో...**

అన్ని రకాల కూరగాయ పంటలను మల్చింగ్ విధానంతో సాగు చేయవచ్చు. పందిరిపై తీగజాతి కూరగాయల సాగుకు ఎంతో మేలు చేస్తుంది.

**ఉపయోగాలు...**

మల్చింగ్ విధానంలో ఒక సారి నీరు పెడితే నేల స్వభావాన్ని బట్టి వారం నుంచి 15రోజుల వరకు నీరు అవసరముండదు. మొక్క వద్ద తేమ ఆరిపోకుండా ఉంటుంది. వేర్లకు కావాల్సిన నీరు నిరంతరంగా అందుతుంది. ఎరువులు కూడా ఎక్కువ శాతం మొక్క తీసుకొంటుంది. దీంతో మొక్క ఆరోగ్యంగా ఎదుగుతుంది. కలుపును పూర్తిగా నివారించవచ్చు. తక్కువ నీరు..తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులను సాధించవచ్చు. భూమిలోఎప్పుడు తేమ ఉండటం వలన నేల గుల్ల బారి వేరు వ్యవస్థ బాగా వృద్ధి చెందుతుంది.

**మల్చింగ్ షీట్‌లు..**

మల్చింగ్ షీట్‌ను బలంగా లాగొద్దు. చల్లని వాతావరణం ఉన్నప్పుడు ఉదయం లేదా సాయంత్రం వేళల్లో వేయాలి. ఎక్కువ గాలి వీచే సమయంలో వేయొద్దు. 7-25మైక్రాన్ల మందం కలిగిన మల్చింగ్ షీట్ ఒక పంట కాలం వరకు ఉంటుంది. మల్చింగ్ షీట్లు చాల రంగుల్లో ఉంటాయి. సీజన్‌లో వేసే పంటను బట్టి షీట్లను ఎంపిక చేసుకోవాలి. ముఖ్యంగా షీట్లను పశువులు తొక్క కుండా జాగ్రత్త పడాలి.

**ఎస్సీ, ఎస్టీ రైతులకు సబ్సిడీ**



ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై మల్చింగ్ షీట్లను అందిస్తుంది. ఎకరాల్లో పంటలను బట్టి ఖర్చు పెరుగుతుంది. తీగ జాతి పంటలకు తక్కువ గాను మిగత పంటలకు ఎక్కువగాను అవసరమవుతుంది. ఎకరాకు రూ.6400ల సబ్సిడీ ప్రభుత్వం అందిస్తుంది. కాని ప్రస్తుతం కేవలం ఎస్సీ, ఎస్టీ రైతులకు మాత్రమే సబ్సిడీ ఉంది. మిగత రైతులు వారే కొనుగోలు చేసుకోవాలి.

– అక్షితరెడ్డి ఉద్యాన శాఖ అధికారి, మోమిన్‌పేట

# సాల్వీడు జెడ్పీ పాఠశాల వార్షికోత్సవం



జెడ్పీ పాఠశాలలో విద్యార్థులతో ఉపాధ్యాయులు

కుల్కచర్ల: విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో ముందుకుసాగాలని సాల్వీడు జెడ్పీ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రాంచంద్రయ్య అన్నారు. మంగళవారం కుల్కచర్ల మండలం సాల్వీడు గ్రామంలోని జెడ్పీ పాఠశాలలో వార్షికోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..విద్యార్థులు పదోతరగతిలో ఎలాంటి నిర్లక్ష్యం ప్రదర్శించకుండా శ్రద్ధతో చదువుకోవాలన్నారు. అనంతరం విద్యార్థుల నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శన ఆకట్టుకున్నది. ఈ కార్యక్రమంలో స్థానిక ఉపాధ్యాయులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## వీడ్కోలు సమావేశం



మోమిన్‌కలాన్‌లో పదోతరగతి విద్యార్థులతో ఉపాధ్యాయులు

ధారూరు: ధారూరు మండల పరిధిలోని మోమిన్‌కలాన్ ఉన్నత పాఠశాలలో మంగళవారం పదోతరగతి విద్యార్థులకు ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బసిరెడ్డి మాట్లాడుతూ రానున్న పరీక్షల్లో మంచి మార్కులు సాధించి జిల్లా స్థాయిలో రాణించాలని ఆకాంక్షించారు. అనంతరం గ్రామ యువజన సంఘం సభ్యుడు శ్రీకాంత్‌రెడ్డి విద్యార్థుల పరీక్షకు సంబంధించిన ప్యాడ్స్, కంపాక్స్ బాక్స్‌లు, పెన్నులు అందజేశారు. ఈ కార్యక్రంలో ఉపాధ్యాయులు, యువజన సంఘం సభ్యులు పాల్గొన్నారు.

# ప్రతీ విద్యార్థి భవిష్యత్‌లో రాణించాలి

- ముత్తూట్ ఫైనాన్స్ సీఎస్ఆర్ మేనేజర్ లక్ష్మీనారాయణ
- గతేడాది 8, 9వ తరగతిలో టాపర్లకు బహుమతుల ప్రదానం



ప్రశంసా పత్రాలు అందుకుంటున్న విద్యార్థులు

దోమ: ప్రతీ విద్యార్థి భవిష్యత్‌లో రాణించాలని ముత్తూట్ ఫైనాన్స్ సీఎస్ఆర్ మేనేజర్ లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. మంగళవారం హైదరాబాద్ నగరంలోని గ్రంథాలయ కార్యాలయ ఆవరణలో ముత్తూట్ ఫైనాన్స్ ఆధ్వర్యంలో ఎం.జార్జ్ ఫౌండేషన్ ఎక్సలెన్స్ అవార్డులను అందచేశారు. జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన జి.ప్రేరణ, కె.సంధ్య, బాలికల పాఠశాలకు చెందిన సరిత, సాదియా, కస్తూర్బాగాంధీ పాఠశాలకు చెందిన ప్రవళిక, పవిత్ర గతేడాది 8, 9వ తరగతిలో టాపర్లుగా నిలిచారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను హైదరాబాద్ నగరానికి తీసుకెళ్లారు. అక్కడ కమిషనర్ ఆఫ్ రూరల్ డెవలప్‌మెంట్ అధికారి మహేశ్ బాబు చేతుల మీదుగా ప్రశంసా పత్రాలతో పాటు నగదు బహుమతులను ప్రదానం చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ..ప్రభుత్వ పాఠశాలలో చదివే పేద విద్యార్థులను ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో జోనల్ మేనేజర్లు బిందూ, రాష్ట్ర గ్రంథాలయ ముఖ్య అధికారి, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు శ్రీవిద్య, కస్తూర్బాగాంధీ ఎస్ఓ చైతన్య, ముత్తూట్ ఫైనాన్స్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హరీశ్వర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయం

**మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి**



జయంతిలో మాజీ ఎమ్మెల్యే తదితరులు

పరిగి: మాజీ డిప్యూటీ స్పీకర్ కొప్పుల హరీశ్వర్‌రెడ్డి సేవలు చిరస్మరణీయమని మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేశ్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం హరీశ్వర్‌రెడ్డి జయంతి సందర్భంగా కేక్ కట్‌చేసి ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ పరిగి నియోజకవర్గానికి 40సంవత్సరాల పాటు సేవలు అందించారన్నారు. ప్రత్యేక రాష్ట్ర సాధనలో భాగంగా ఎమ్మెల్యే పదవికి రాజీనామ చేసి రాష్ట్ర సాధన కోసం పోరాటం చేశారని మాజీ ఎమ్మెల్యే మహేశ్‌రెడ్డి గుర్తు చేశారు. నియోజకవర్గంలో ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనులు చేపట్టారన్నారు. ప్రతీ పనిలో ఆయన ముద్ర ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కొప్పుల అనిల్‌రెడ్డి, గిరిజాదేవి, మాజీ మున్సిపల్ చైర్మన్ ముకుందఅశోక్‌కుమార్, ప్రవీణ్‌రెడ్డి, ఆంజనేయులు, సురేందర్, రవికుమార్, రవీందర్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# క్రమశిక్షణతో చదువుకోవాలి

**మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి**



పరీక్ష ప్యాడ్లు అందిస్తున్న జగదీశ్వర్‌రెడ్డి

కొడంగల్ రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని మున్సిపల్ మాజీ చైర్మన్ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. మంగళవారం పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర, బాలికల ఉన్నత పాఠశాలలు, మండల పరిధిలోని రావులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదోతరగతి విద్యార్థులకు పరీక్ష ప్యాడ్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు మంచి మార్కులు సాధించి పాఠశాలలకు, తల్లిదండ్రులకు కీర్తి తీసుకరావాలన్నారు. కొడంగల్ పట్టణానికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కీ.శే.యాలాల అంతప్ప, అచ్చుకట్ల బాలకిష్టయ్య, ప్రేమ్‌నాథ్, నరహరి వాసిష్ట, విజయలక్ష్మిల జ్ఞాపకార్థం పరీక్ష ప్యాడ్లను అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ రాజేశ్‌రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు నందారం ప్రశాంతు, మార్కెట్ కమిటీ చైర్మన్ అంబయ్యగౌడ్, పీఏసీఎస్ చైర్మన్ కటుకం శివకుమార్‌గుప్తా, మురారి వాసిష్ట, సయ్యద్ మునీర్‌లతోపాటు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## కవిత పోరాట ఫలితమే 42 శాతం రిజర్వేషన్

**యునైటెడ్ పూలేఫ్రంట్ కన్వీనర్ కుమ్మరి శ్రీనివాస్**

ధారూరు: తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కె.కవిత పోరాట ఫలితమే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదించారని యునైటెడ్ పూలేఫ్రంట్ కన్వీనర్ కుమ్మరి శ్రీనివాస్ పేర్కొన్నారు. మంగళవారం ఆయన నగరంలో కవితను కలిసి పూలబొకే ఇచ్చి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యునైటెడ్ పూలే ఫ్రంట్ ఆధ్వర్యంలో రాష్ట్రం అంతటా పర్యటించి రౌండ్ టేబుల్ సమావేశాలు, చర్చలు, ధర్నా లు నిర్వహించడం ద్వారా బీసీల హక్కుల సాధన సాధ్యమైందని ఆయన గుర్తు చేశారు. ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లు ఆమోదించడం ద్వారా బీసీ వర్గాల సమగ్ర అభివృద్ధికి దోహదపడుతుందన్నారు. విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో బీసీలకు న్యాయమైన ప్రాతినిధ్యం లభిస్తుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.



ఎమ్మెల్సీ కవితకు బొకే ఇస్తున్న శ్రీనివాస్

# షాట్‌పుట్ క్రీడాకారుడికి చెక్ అందజేత

**చంద్ర శేఖర్ రెడ్డి ప్రత్యేక చొరవతో సాయం**



సాయికిరణ్‌కు చెక్ అందజేస్తున్న సంస్థల ప్రతినిధులు, తిరుపతి రెడ్డి

దుద్యాల్: హస్నాబాద్ గ్రామానికి చెందిన అల్వాల్ సాయికిరణ్ షాట్‌పుట్ రాణిస్తున్నాడు. అతనికి మెరుగైన శిక్షణకోసం నెల్లాక్ పాఠశాల యాజమాన్యం, ఇన్నింగ్స్-2 ఐటీ కంపెనీ హైదరాబాద్ ప్రోత్సాహకంగా రూ.20వేల చెక్‌ను కొడంగల్ కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి తిరుపతి రెడ్డితో కలిసి అందజేశారు. ఈ సందర్భంగా నెల్లాక్ పాఠశాల యాజమాన్యం, ఇన్నింగ్స్-2 ఐటీ కంపెనీ సిబ్బంది, గ్రామానికి చెందిన చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడారు. సాయి కిరణ్ షాట్‌పుట్‌లో రాణించి రాష్ట్రానికి, దేశానికి కీర్తి తేవాలన్నారు. భవిష్యత్‌లో అతనికి మరింత సాయం అందజేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ రెడ్డి, సంస్థల ప్రతినిధులు లావణ్య, వినీల, సుప్రజ, కరుణ, వాసవి తదితరులు పాల్గొన్నారు.

## సంక్షిప్త వార్తలు

**◆ సీసీ రోడ్డు పనులు ప్రారంభం**

మర్పల్లి: మండల కేంద్రంలోని ఫైల్‌మాన్ కట్ట కాలనీలో ఉపాధిహామీ పథకం కింద రూ.10లక్షలతో చేపడుతున్న సీసీ రోడ్డు పనులను మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ రామేశ్వర్ స్థానిక కాంగ్రెస్ నాయకులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు స్పీకర్ ప్రసాద్‌కుమార్ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కాలనీలో సీసీ రోడ్డు వేయిస్తున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు పాండునాయక్, సలీం, మాజీ వార్డు మెంబర్ సర్వేశ్, బీసీ సెల్ మండల మాజీ అధ్యక్షుడు నాగేశ్, స్థానిక కాంగ్రెస్ నాయకులు దివాకర్, ఫసి, నర్సింలు యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

**◆ లగచర్లకు స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ మంజూరు**

దుద్యాల్: మండల పరిధిలోని లగచర్ల గ్రామంలో స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ మంజూరైనట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఆవుటి శేఖర్ తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మండలం అభివృద్ధికి ముఖ్యమంత్రి కట్టుబడి ఉన్నారని, మండలం అన్ని రకాల అభివృద్ధి చెందాలనే లక్ష్యంతో కళాశాల, వైద్యశాల, ఐటీఐ కళాశాల, కంపెనీలు వంటివి ఏర్పాటు చేస్తున్నారని అన్నారు. మండల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపిస్తున్నందుకు ధన్యవాదలు తెలిపారు.

**◆ విద్యార్థులకు క్విజ్ పోటీలు**

ధారూరు: తరిగోపుల స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని 10 పాఠశాలల విద్యార్థులకు మంగళవారం క్విజ్ పోటీలు నిర్వహించారు. విద్యార్థుల ప్రతిభను వెలికితీసేందుకు శిక్షణ ఫౌండేషన్ ఈ పోటీలను ఏర్పాటు చేసింది. ప్రథమ స్థానంలో అంపల్లి, ద్వితీయ స్థానంలో పీసీఎంతండా, తృతీయ స్థానంలో ఊరుముందలి తండాలు వచ్చాయని తరిగోపుల స్కూల్ కాంప్లెక్స్ హెచ్‌ఎం ప్రభాకర్‌రావు, ఇంచార్జి సంయోద్దీన్‌లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఆర్‌పీ సత్యనారాయణ, శిక్షణ ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**◆ ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం**

దుద్యాల్: మండల పరిధిలో పోలేపల్లి గ్రామంలోని గ్రామత్రి పాఠశాలలో మంగళవారం ఘనంగా స్వయం పరిపాలన దినోత్సవం నిర్వహించారు. విద్యార్థులే ఉపాధ్యాయులుగా మారి తోటి విద్యార్థులకు పాఠాలు బోధించారు. డీఈవోగా చందన, ఎంఈవోగా స్రవంతి, ప్రిన్సిపల్‌గా సిద్దు నాయక్‌లు వ్యవహరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉపాధ్యాయులుగా మారిన విద్యార్థులు వారి వారి అభిప్రాయాలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం రమేశ్ గౌడ్, ఉపాధ్యాయులు జ్యోతి, సావిత్రి, లావణ్య, వీరమణి, పుష్పలత తదితరులు పాల్గొన్నారు.

**◆ పార్టీ బలోపేతానికి కృషి**

మర్పల్లి: బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని జిల్లా నూతన అధ్యక్షుడు డాక్టర్ రాజశేఖర్ రెడ్డి కార్యకర్తలకు ఆదేశించారు. వికారాబాద్ జిల్లాకు నూతనంగా బీజేపీ అధ్యక్షుడిని నియమిస్తూ ఆ పార్టీ అధిష్ఠానం సోమవారం డాక్టర్ రాజశేఖర్ రెడ్డికి నియామక ఉత్తర్వులు అందజేశారు. ఈ విషయం తెలుసుకున్న మర్పల్లి బీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సీబీఎన్ నాగయ్య ఆధ్వర్యంలో మంగళవారం వికారాబాద్ పట్టణంలోని రాజశేఖర్ రెడ్డి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిసి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో పి రవీందర్‌రెడ్డి, నాగారాజ్, సురేష్ గౌడ్, సీహెచ్ పాండు, నర్సింలు, జే.శ్రీనివాస్, సాయికృష్ణ నారాయణ, అబ్రహం, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

**◆ నిర్భయంగా పరీక్షలు రాయండి**

**వీడ్కోలు సమావేశంలో ఎంఈవో విజయరామారావు**



వీడ్కోలు సమావేశంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు

దుద్యాల్: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి విద్యార్థులకు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి మండల విద్యాధికారి విజయరామారావు హాజరై మాట్లాడారు. విద్యార్థులు భయం వీడి నిర్భయంగా పరీక్షలు రాయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు రవీందర్ గౌడ్, మల్లప్ప, సుధాకర్ రావ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# పల్లెలకు మహర్దశ



కొర్విచెడ్‌గనిలో సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న పీఏసీఎస్ వైస్ చైర్మన్ అజయ్‌ప్రసాద్, కాంగ్రెస్ నాయకులు

- రూ.17.25 కోట్లతో సీసీ రోడ్లు
- రూ.2.60 కోట్లతో పంచాయతీ, అంగన్‌వాడీ భవనాలు
- ఎస్సీసబ్ ప్లాన్ నుంచి మరో రూ.10.24 కోట్లు మంజూరు
- దళితవాడల్లో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులు
- ఈ నెలాఖరుకు ఎన్ఆర్ఈజీఎస్ పనుల పూర్తి
- తాండూరులో జోరుగా అభివృద్ధి పనులు

బషీరాబాద్: తాండూరు నియోజవర్గంలోని పల్లెలకు మహర్దశ పట్టుకుంది. మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకంలో నియోజవర్గంలోని గ్రామాల్లో రూ.19.85 కోట్లతో జోరుగా అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ఎస్సీ సబ్‌ప్లాన్ నుంచి తాజాగా రూ.10.24కోట్లు మంజూరయ్యాయి. ఈ నిధులతో దళిత వాడల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణ పనులు చేపట్టనున్నారు. ఈ నెలాఖరుకు ఉపాధి హామీ నిధుల ఖర్చుకు గడువు ఉండడంతో గ్రామాల్లో అభివృద్ధి పనులు శరవేగంగా కొనసాగుతున్నాయి. తాండూరు నియోజకవర్గంలోని బషీరాబాద్, యాలాల, తాండూరు, పెద్దేముల్, కోట్‌పల్లి మండలంలోని ఆరు గ్రామాలతో కలిపి 143 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ పంచాయతీ పరిధిలోని అంతర్గత మట్టిరోడ్లన్నీ సీసీ రోడ్లుగా మారనున్నాయి. వీటి కోసం ఉపాధి హామీ పథకంలో రూ.17.25 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నారు. ఇలా ఒక్కో గ్రామానికి ఎన్ఆర్ఈజీఎస్ నుంచి రూ.20లక్షల వరకు కేటాయించారు. దీంతో ఇప్పటి వరకు సీసీ రోడ్లకు నోచుకోని అరంతర్గత రోడ్లన్నీ అద్దంలా మారనున్నాయి. వీటితో పాటు ఎస్‌డీఎఫ్ (స్పెషల్ డెవెలప్‌మెంట్ ఫండ్) కింద ప్రత్యేక నిధులతో కూడా పనులు నిర్వహిస్తున్నారు.



బషీరాబాద్‌లో అంతర్గత సీసీ రోడ్డు

**11 కొత్త జీపీ భవనాలు..**

నియోజకవర్గంలోని బషీరాబాద్, యాలాల, తాండూరు, పెద్దేముల్, కొట్టిపల్లి మండలాలకు కలిపి 11 కొత్త పంచాయతీ భవనాలు మంజూరయ్యాయి. వీటిలో బషీరాబాద్ మండలంలో మంతట్టి, పర్వత్ పల్లి, వాల్యానాయక్‌తండా, కొత్లాపూర్, గొట్టిగఖుర్దు యాలాల మండలంలో జుంటిపల్లి, లక్ష్మీనారాయణపూర్, సంగంకలాన్, తాండూరులో గోనూరు, పెద్దేముల్‌లో హన్మాపూర్, కోట్‌పల్లి మండలంలోని అన్నసాగర్ గ్రామాల్లో జీపీ భవనాల నిర్మాణ పనులు సాగుతున్నాయి. అలాగే మైల్వార్, జక్కెపల్లి, సంగం కలాన్, సిద్ధన్నమడుగుతండా, బుగ్గపూర్ గ్రామాలలో రూ.40లక్షలతో అంగన్‌వాడీ భవనాలు నిర్మిస్తున్నారు. ఉపాధి హామీ నిధులనుంచి చేపట్టిన ఈ పనులన్నీ మార్చి చివరివరకు పూర్తి కానున్నాయని అధికారులు చెబుతున్నారు.

**దళితవాడల అభివృద్ధికి రూ.10.24 కోట్లు..**

నియోజవవర్గంలోని గ్రామీణ ప్రాంతాలతో పాటు, తాండూరు పట్టణంలోని దళిత వాడల అభివృద్ధికి రూ.10.24కోట్లు ఎస్సీ సబ్‌ప్లాన్ నిధులు రెండు రోజుల క్రితం మంజూరు చేశారు. ఈ నిధులతో ప్రత్యేకంగా ఎస్సీ కాలనీల్లో ఇప్పటి వరకు నిధులు కేటాయించని ప్రాంతాల్లో సీసీ రోడ్లు, మురుగు కాల్వల నిర్మాణం చేపట్టనున్నారు.

**ప్రణాళికాబద్ధంగా అభివృద్ధి**



ప్రత్యేక ప్రణాళికలతో ప్రభుత్వం నుంచి భారీగా నిధులు రాబట్టి నియోజకవర్గంలోని ప్రతీ గ్రామానికి నిధులు కేటాయించాం. అన్నీ గ్రామాల్లో ఉపాధిహామీ పథకం కింద అభివృద్ధి పనులు కొనసాగుతున్నాయి. ముఖ్యంగా సీసీ రోడ్లు, మురుగు కాల్వలు, పంచాయతీ, అంగన్‌వాడీ భవనాల నిర్మాణాలతోపాటు మౌలికవసతులు కల్పిస్తున్నాం. అలాగే అర్బన్ ప్రాంతం అభివృద్ధికి కూడా భారీగా నిధులు కేటాయించాం. ఎవరూ ఊహించని రీతిలో అన్నీ రంగాల్లో అభివృద్ధి పనులు నిర్వహించనున్నాం. సీఎం ప్రత్యేక చొరవతో సమీప భవిష్యత్తులో తాండూరు ప్రాంత రూపురేఖలు పూర్తిగా మారనుంది.

– బుయ్యని మనోహర్‌రెడ్డి, ఎమ్మెల్యే, తాండూరు